కల్యాణ వైభోగమే..


వీరఘట్టం మండలం విక్రమపురంలో కల్యాణ ఆహ్వాన వేదిక (ఫైల్)



- ప్రారంభమైన శుభ ముహూర్తాలు
- ఏప్రిల్ 18 నుంచి జూన్ 8 వరకు వివాహాల సందడి
- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వేల సంఖ్యలో జరగనున్న పెళ్లిళ్లు
- జూన్ 11 నుంచి మొదలుకానున్న ఆషాఢం
- మరలా జూలై 25న వచ్చే శ్రావణమాసంలో ప్రారంభంకానున్న ముహూర్తాలు
- జోరందుకున్న బంగారు, వస్త్ర వ్యాపారాలు

వీరఘట్టం: వివాహం ప్రతి ఒక్కరి జీవితంలో మధురానుభూతి. వధూవరులకు అతి పెద్ద పండగ. పిల్లల వివాహాలను వైభవంగా అందరూ మెచ్చుకునేలా చేయాలని తల్లిదండ్రుల ఆరాటం. అందుకే కాస్త ఆలస్యమైనా అన్నీ సవ్యంగా కుదిరాకే పెళ్లిళ్లు చేస్తుంటారు. ప్రస్తుతం ఏప్రిల్ నెల నుంచి శుభముహూర్తాలు రావడంతో పెళ్లిళ్లను అంగరంగ వైభవంగా చేసుకునేందుకు కొత్త జంటలు సిద్ధమవుతున్నాయి. ప్రతి ఏటా ఎక్కువగా వేసవి సీజన్‌కు పెళ్లిళ్లకు అనువుగా ఉంటుంది. అయితే గతేడాది వేసవిలో అధిక శూన్యమాసం రావడంతో పెళ్లిళ్ల సంఖ్య తగ్గాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వరుస ముహూర్తాలు ఉండడంతో వివాహాలు జోరందుకున్నాయి.

వేల సంఖ్యలో వివాహాలు...

ఏప్రిల్‌లో 6 ముహూర్తాలు, మే నెలలో 15 శుభ ముహూర్తాలు, జూన్ నెలలో మరో 6 ముహూర్తాలు ఉన్నాయి. జూన్ 11 నుంచి జూలై 12 వరకు ఆషాఢం కావడంతో శుభకార్యాలకు ఎటువంటి ముహూర్తాలు లేవని పురోహితులు చెబుతున్నారు. మరలా జూలై 25 నుంచి శ్రావణమాసంలో మంచి ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అధిక సంఖ్యలో వివాహాలు జరిపించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపాలు రిజర్వ్ చేసుకుంటున్నారు. డెకరేషన్, క్యాటరింగ్, మంగళ వాయిద్యాలకు అడ్వాన్స్‌లు ఇస్తున్నారు.

జోరుగా వ్యాపారం..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో విజయనగరంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఈ రెండు జిల్లాల్లో రోజుకు రూ.5 నుంచి రూ.7 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. విజయనగరం, పార్వతీపురం, పాలకొండ, వీరఘట్టం ప్రాంతాల్లో బంగారం, వస్త్ర వ్యాపారాలు జోరందుకున్నాయి. అలాగే భజంత్రీలు, ఫ్లవర్ డెకరేటర్లు, పురోహితులు, వంట మాస్టర్లు, స్వీట్లు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, కల్యాణ మండపాలకు మంచి డిమాండ్ పెరిగింది.

ఇవీ శుభ ముహూర్తాలు...

ఏప్రిల్ నెలలో 16, 18, 20, 21, 23, 30 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి

మే నెలలో 1, 3, 4, 8, 9, 10, 11, 14, 16, 19, 21, 23, 24, 30 వరకు ముహూర్తాలున్నాయి.

జూన్ నెలలో 2, 4, 5, 6, 7, 8 వరకు ముహూర్తాలు ఉన్నాయి.

ఈ మూడు నెలల్లో అధికం..



గతేడాది వేసవి కంటే ఈ ఏడాది వేసవి మూడు నెలల్లో అధిక ముహూర్తాలున్నాయి. ముఖ్యంగా మే నెలలో 15 ముహూర్తాలు ఉన్నాయి. ముహూర్తాలు ఎక్కువ కావడంతో పురోహితులను సమకూర్చడం కష్టంగా మారుతోంది.

– ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజి, యజ్ఞకర్త, వీరఘట్టం

క్లుప్తంగా

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి

గరుగుబిల్లి: గర్భిణుల, బాలింతలు విధిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పెదగుడబ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి అన్నారు. మండలంలోని రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమంలో ఆమె గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు గాజులు, జాకెట్లు, తినుబండారాలు, పండ్లు తదితరవి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రక్తహీనత లేకుండా ప్రతీ ఒక్కరు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఆరోగ్యంలో ఏవైనా సమస్యలు ఉంటే తక్షణం ఏఎన్ఎంకుగాని, అంగన్‌వాడీ కార్యకర్తలకుగాని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ ఎం.సావిత్రితో పాటు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం


సూరంపేట జీడి తోటలో విరిగిన విద్యుత్ స్తంభం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురువడంతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలపై పడిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీనిపై ఏఈ శశిభూషణరావు మాట్లాడుతూ ఈదురుగాలులతో కూడిన వర్షం వల్ల సూరంపేట, మరిపివలస, చిన్నారాయుడుపేట, సీతారాంపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఆరు విద్యుత్ స్తంభాలు విరిగి నేల కూలాయన్నారు. కొత్తగా విద్యుత్ స్తంభాలు వేస్తామని, అంత వరకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చర్యలు చేపట్టామన్నారు.

ఆరోగ్యంపై మరింత శ్రద్ధ..

భామిని: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని సీడీపీఓ శాంతిభవానీ అన్నారు. మండలంలోని దిమ్మిడిజోల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్‌పక్వాడ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వలరౌతు రజనీ రామారావు, బీపీఎస్ వరలక్ష్మి, ఎస్ఓ సబితా పట్నాయక్, సెక్టార్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పాలకొండ: మండలంలోని తంపటాపల్లి గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేరీ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం, మెరుగైన ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూపర్‌వైజర్ మేరీ వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

పాలకొండ: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎస్ఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు కె. శంకరరావు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులను వెంటనే కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వావిలపల్లి రాజేష్, వైకుంటరావు, ఎం. సుబ్బారావు, కేపీ ప్రసాద్, బీవీ రమణ, సంగమేష్, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల ప్రచారం

వీరఘట్టం: ప్రభుత్వ బడుల మనుగడ కాపాడుకునేందుకు యూటీఎఫ్ నాయకులు కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా ప్రచారం చేపట్టి, చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మజ్జి పైడిరాజు, కురమాన గోవిందరావు, బోనంగి దుర్గాప్రసాద్, కె.సింహాచలం, ఎం.ముకుందరావు, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి భార్యాభర్తలకు గాయాలు

వీరఘట్టం: వండువ–నవగాం గ్రామాల మధ్యలో సీఎస్‌పీ రోడ్డులో బైక్‌పై వెళ్తున్న సోమినాయుడు, పద్మ దంపతులు బైక్ అదుపుతప్పడంతో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మక్కువ గ్రామం నుంచి గురువారం పాలకొండ వెళ్తున్న దంపతులు ప్రమాదానికి గురయ్యారు. అటుగా వెళ్తున్న వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జలుమూరు అమర్‌నాథ్ ప్రమాదాన్ని గమనించి క్షతగాత్రులైన దంపతులను వీరఘట్టంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యచికిత్స అందజేసి మానవత్వం చాటుకున్నారు. క్షతగాత్రుల్లో పద్మకు చేయి విరగడంతో మెరుగైన వైద్యం కోసం బంధువులు పార్వతీపురం తరలించారు. ఆపదలో ఉన్న తమను తన సొంత కారులో తీసుకువచ్చి ఆస్పత్రిలో చేర్పించిన అమర్‌నాథ్‌కు బాధిత దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణాలు వేగవంతం


నిర్మాణాల తాజా స్థితిగతులు పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: గృహ లబ్ధిదారులు వారికి కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ ఏపీఓ, పాలకొండ అర్బన్ ప్రత్యేకాధికారి చినబాబు అన్నారు. లుంబూరు సమీపంలో గల అర్బన్ కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. తాజాగా జరుగుతున్న గృహ నిర్మాణాల స్థితిగతులపై సచివాలయాల వారీగా ఆరా తీశారు. ఈ క్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.లక్షా 80 వేలతో పాటు అదనంగా మరో 50 వేల రూపాయలు అందిస్తున్న క్రమంలో పనులు త్వరగా చేపట్టాలన్నారు. పెండింగ్ బిల్లులు దశలవారీగా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట గృహనిర్మాణశాఖ ఏఈ మాధవరావు, నగర పంచాయతీ మేనేజర్ జయరాం, పలు సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే అధిగమించాలి


అగ్ని ప్రమాదాల నుంచి బాధితులను రక్షించే విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారి

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాటిని ప్రాథమిక స్థాయిలోనే అధిగమించేలా ప్రయత్నించాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ సత్యసాయి విద్యాసంస్థల్లో గురువారం ప్రత్యేక అవగాహన కార్యమం చేపట్టారు. కృత్రిమ ప్రమాదాలు సృష్టించి వాటిని ఎలా అధిగమించాలో వివరించారు. ఎత్తైన భవనాలు, రద్దీ ప్రదేశాల్లో పొగ కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితులు, గుండెపోటుకు గురైన బాధితులకు అందించే ప్రథమ చికిత్స, సీపీఆర్ విధానాలను అవగాహన కల్పించారు.

క్రికెట్ టోర్నీ విజేత కురుపాం


విజేతగా నిలిచిన కురుపాం కింగ్స్ జట్టుకు బహుమతి అందజేత

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం ప్రీమియర్ లీగ్ పేరుతో ఆర్గనైజర్లు దొనక నవీన్, పెద్దింటి ఇమ్మానుయేల్ కురుపాంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా కురుపాం కింగ్స్ జట్టు నిలువగా రన్నర్‌గా గుమ్మలక్ష్మీపురం మండలం కొండవాడ జట్టు నిలిచింది. ఈ మేరకు గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కొండవాడ జట్టు 16 ఓవర్లకు 10 వికెట్లు కోల్పోయి 110 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కురుపాం కింగ్స్ జట్టు 7 వికెట్లు నష్టపోయినప్పటికీ 15 ఓవర్లకే 111 పరుగులు సాధించి విజయం సాధించింది. విన్నర్స్ కురుపాం కింగ్స్ జట్టుకు ఆర్గనైజర్స్ సమకూర్చిన రూ.40వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ అందజేశారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన కొండవాడ జట్టుకు మాజీ జెడ్పీటీసీ అంధవరపు కోటేశ్వరరావు రూ.20వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన గుమ్మలక్ష్మీపురం మండలం లిక్కిడి జట్టుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు రూ.10వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ టోర్నీలో 65 జట్లు పాల్గొనగా నెల రోజుల పాటు సాగిందన్నారు. కార్యక్రమంలో కురుపాం ఉప సర్పంచ్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

గరుగుబిల్లి: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన ప్రణాళికలు చేయడం జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుస్థిరమైన ఆర్థిక తోడ్పాటు నిమిత్తం జీవనోపాధుల కార్యక్రమం ద్వారా రుణాలను మంజూరు చేసేందుకు సర్వేను చేపట్టడం జరిగిందన్నారు. స్త్రీనిధి రుణాలు మంజూరుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ప్రతీ మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ హేమలత, ఎఫ్‌పీఓ కె.భారతి, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడుతోపాటు సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రేషన్ పంపిణీ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని గిరిజన గ్రామాలకు ఈకేవైసీ సమస్యపై నిలుపుదల చేసిన రేషన్ సరుకులు గురువారం డిపో నంబర్ 4027 పరిధిలో పంపిణీ చేశారు. టీకేజమ్ము రేషన్ డిపో కాంట్రాక్టు సేల్స్‌మాన్ జె.గోపాలరావు ఎండీయూ వాహనం ద్వారా టీకే జమ్ము పరిధిలో గల గొర్లి, గొర్లివలస, కూటం, పాంద్రసింగి, కోడిపిల్లగూడ, జమ్మవలస, చిన్నదోడిజ, పెద్దదోడిజ గ్రామాలకు చెందిన 563 రేషన్‌కార్డులకు పూర్తి స్థాయిలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈకేవైసీ సమస్యతో సక్రమంగా సరుకులను పంపిణీ చేయలేకపోయామని, మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని తెలిపారు.

విద్యుత్ అంతరాయంతో అధికారులకు తిప్పలు

జియ్యమ్మవలస రూరల్: విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో తహసీల్దార్, ఎంపీడీఓ, విద్యాశాఖ కార్యాలయాల్లో పనులు సరిగ్గా జరగడం లేదని సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సమస్యతో నెట్‌వర్క్ పనిచేయక అనేక ప్రభుత్వ నిర్వహణ కార్యక్రమాలను ఆన్‌లైన్ చేయలేకపోతున్నామని తెలిపారు. అంతేకాకుండా రెవెన్యూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులకు పనులు జరగక వెనుదిరుగుతున్నారని, నిత్యం ఇంటర్నెట్ అవసరమైన కార్యాలయాలకు కనీసం జనరేటర్ లేకపోవడం ఏమిటని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారని తెలిపారు. మరోపక్క ఎప్పుడో ఏర్పాటు చేసిన ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న జనరేటర్ పనిచేయక మూలన పడింది. సంవత్సరాల తరబడి మరమ్మతులకు గురైన జనరేటర్‌ను కనీసం అధికారులు బాగు చేయించకపోవడం శోచనీయమని వారు చెబుతున్నారు.

ఇద్దరి అరెస్ట్

పాలకొండ: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం దాడులు చేపట్టి సారా తయారు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..భామిని మండలానికి చెందిన బిడ్డిక రవి, బిడ్డిక కొండలరావులను అరెస్ట్ చేసి, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే వెయ్యి లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశామన్నారు. బెల్లం విక్రయాలు చేపడుతున్న షణ్ముక అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బందితో పాటు మొబైల్ టీమ్‌కు చెందిన మురళి, కొత్తూరు సీఐ కిరణ్మయి, శ్రీకాకుళం సీఐ లీలారాణి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

దళాయిపేటలో ఏనుగుల గుంపు

కొమరాడ: దళాయిపేట, నిమ్మలపాడు తదితర గ్రామాల పరిసరాల్లో ఎనిమిది గజరాజులు సంచరిస్తున్నాయి. రైతులు రాత్రి పూట పొలాల్లోకి వెళ్ల వద్దని అటవీశాఖ సిబ్బంది హెచ్చరిస్తున్నారు. ఏనుగుల గుంపు కనిపిస్తే కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచిస్తున్నారు. ఈ ప్రాంతంలో జొన్న, కూరగాయల సాగు ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పౌష్టికాహారం తప్పనిసరి..

గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ పి. రంగలక్ష్మి అన్నారు. మండలంలోని జి.గుమ్మడలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గర్భిణులు ఎటువంటి ఆహారం తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రధాని పాల్గొన్నారు. – సీతంపేట



ప్రమాదం సుమీ..

పాలకొండ – పార్వతీపురం వయా రాయగడ ప్రధాన రహదారిలో రాజుపేట కూడలి వద్ద గల దశాబ్దాల కిందట నిర్మించిన ఖానాకు సంబంధించిన రక్షణ గోడ కూలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ ఖానా పైనుంచి రాకపోకలు సాగిస్తాయి. ఏ మాత్రం అలసత్వంగా ఉన్నా ప్రమాదం తప్పదని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు కూలిన రక్షణ గోడను గమనించకుంటే పెను ప్రమాదం తప్పదు. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని పలువురు కోరుతున్నారు. – పాలకొండ రూరల్



నిబంధనలు పాటించాలి..

వాహనచోదకులు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పాలకొండ ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. పాలకొండ – శ్రీకాకుళం, పార్వతీపురం అంతర్రాష్ట్ర రహదారుల్లో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి పెద్ద ఎత్తున లారీలు, ఇతర వాహనాలు పాలకొండ మీదుగా రాకపోకలు సాగిస్తున్న క్రమంలో నిషేధిత సరుకుల రవాణా జరగకుండా తనిఖీలు చేపడుతున్నారు. డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుం విధించారు. – పాలకొండ రూరల్

విద్యార్థులకు అవగాహన


కేడీ కాలనీ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: సికిల్‌సెల్ అనీమియాపై తాడికొండ పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది గురువారం తాడికొండ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, కేడీ కాలనీ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో పాటు రెల్ల, కుక్కిడి, ఇరిడి గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు మాట్లాడుతూ ఏజెన్సీలో అధికంగా కనిపించే అరుదైన వ్యాధుల్లో సికిల్‌సెల్ అనీమియా ఒకటన్నారు. దీని బారిన పడిన వారిలో రక్తం రోజురోజుకూ తగ్గిపోతుందని, నీరసించి పోవడం, తీవ్రమైన శరీరక నొప్పులు, కాళ్లు, చేతుల వాపులు వంటి లక్షణంతో తరచూ బాధపడుతుంటారని తెలిపారు. దీనిపై అవగాహన లేకపోవడం వలనే మరణాలు సంభవిస్తున్నాయని.. ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి


బాలికలకు సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: బాలికలు వారి రక్షణ కోసం రూపొందించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దశారత్నం అన్నారు. మండలంలోని ఎం. సింగిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ఆవశ్యకత, రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం నాయుడు, సూపర్‌వైజర్ మేరీ, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

గుమ్మలక్ష్మీపురం: పాలిటెక్నిక్ విద్యతో సత్వరమే ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని ప్రిన్సిపాల్ ఎ.జగదీశ్వరరావు అన్నారు. స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమం (జాబ్ అచీవర్స్ డే) గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థుల్లో నలుగురు ఫైనలియర్ విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయన్నారు. ఉద్యోగావకాశాలు పొందిన విద్యార్థులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎ.సన్యాసినాయుడు, పలువురు లెక్చరర్లు ఉన్నారు.



బైక్ షోరూం కాదు.. తహసీల్దార్ కార్యాలయమే...!

జియ్యమ్మవలస మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు షెడ్డు లేకపోవడంతో తమ వాహనాలను కార్యాలయం వరండాలోనే ఇలా నిలుపు చేస్తున్నారు. అది కూడా ప్రవేశ ద్వారం ఎదురుగా తమ బైక్‌ల నీడ కోసం ఉంచుతున్నారు. దీంతో రెవెన్యూ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ ఉద్యోగులు తమ కార్యాలయం ముందు ఇలా బైక్‌లు నిలుపు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– జియ్యమ్మవలస రూరల్